
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

కోనసీమ

జిల్లా వార్తలు

శుక్రవారం 19 జనవరి 2024 | 5



కొత్తపేటలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, నాయకులు, కార్యకర్తలు



పి.గన్నవరంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ అమలాపురం పార్లమెంటరీ అధ్యక్షుడు గంటి హరీష్‌మాధుర్. చిత్రంలో నామన రాంబాబు, దొక్కా నాథ్‌బాబు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు



మండపేటలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

తెలుగు తేజానికి నివాళి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 28వ వర్ధంతిని గురువారం కోనసీమ జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. తెలుగు ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఆయనే అని గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు.... 8లో



ముద్రగడతో భేటీ అయిన చిట్టిబాబు

- రేపు మండపేటలో చంద్రబాబు బహిరంగ సభ
- శెట్టిబలిజ నేత వాసంశెట్టి సుభాష్ సహా వివిధ పార్టీల నేతలు టీడీపీలో చేరికకు రంగం సిద్ధం
- జనసేన-టీడీపీ సీట్ల కేటాయింపుపై ఉత్కంఠ
- ముద్రగడతో వైసీపీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు భేటీ

రాజకీయ వేడి

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో శనివారం అమలాపురం పార్లమెంటు స్థాయిలో జరిగే భారీ బహిరంగ సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పాల్గొననుండడంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు రాజీనామా చేసి చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గ స్థాయిలో నేతలు సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు. మండపేటలో సభా స్థలి ప్రాంగణాన్ని టీడీపీ జిల్లా నేతలు గురువారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. నియోజకవర్గ స్థాయిలో పరిశీలకులతో పాటు ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్య నేతలు ఎక్కడికక్కడ సమావేశాలు నిర్వహిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో టిక్కెట్లు ఆశించే అభ్యర్థులు ఈ సభను విజయవంతం చేయడం ద్వారా తమ పట్టును నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

చంద్రబాబు పర్యటన నేపథ్యంలో వివిధ రాజకీయ పక్షాలకు చెందిన నేతలు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. కొత్తపేట, మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో వైసీపీకి చెందిన ముఖ్య నేతలు, ద్వితీయ శ్రేణి నేతలు ఆ పార్టీ నుంచి బయటకొచ్చి టీడీపీ తీర్థం తీసుకునేందుకు నిర్ణయం తీసుకున్నారు. అమలాపురం పట్టణానికి చెందిన శెట్టిబలిజ సామాజికవర్గ యువ నేత వాసంశెట్టి సుభాష్ తన అనుచరులతో వైసీపీకి రాజీనామా చేసి శనివారం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరతారని ప్రచారం జరుగుతోంది. మరికొంతమంది నేతలు కూడా పసుపు కండువాలు కప్పుకోవడానికి రెడీ అయ్యారు. టీడీపీ, జనసేనల్లోని ఆశావహులతో వివిధ నియోజకవర్గాల్లో ఇప్పటికే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఎవరికివారే వ్యూహాత్మక ఎత్తుగడలతో టిక్కెట్ల కోసం పైరవీలు చేస్తున్నారు.

వైసీపీకి చెందిన పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కాపు సామాజికవర్గ నేత ముద్రగడ పద్మనాభంతో భేటీ అయ్యారు. చిట్టిబాబుతో పాటు అమలాపురం పట్టణానికి చెందిన జనసేన నేతలు కూడా ముద్రగడను కలిశారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు పి.గన్నవరం టిక్కెట్‌ను వైసీపీ కేటాయించలేదు. ఆయన స్థానంలో జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించ డంతో చిట్టిబాబు పక్క పార్టీలవైపు దృష్టి సారించారని సమాచారం. ఇందులో భాగంగా ముద్రగడ పద్మనాభం ద్వారా జనసేనలో చేరతారనే ప్రచారం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కూడా వైసీపీని వీడనున్నట్టు తెలుస్తోంది.

అయితే వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా తమ మద్దతుదారులకు అప్పుడే సీట్ల కేటాయింపు జరిగిపోయినట్టు, త్వరలో మంత్రులుగా కూడా బాధ్యతలు కూడా చేపట్టే సందర్భాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలపుతూ పోస్టింగులు పెడుతున్న తీరు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మరోవైపు, టీడీపీ, జనసేన పొత్తుల నేపథ్యంలో ఏ నియోజకవర్గాన్ని ఏ పార్టీకి కేటాయిస్తారనే అంశంపై ప్రజల్లో తీవ్రమైన చర్చలు ప్రారంభమయ్యాయి. ఏదేమైనప్పటికీ చంద్రబాబు మండపేట సభ అనంతరం కోనసీమ జిల్లా రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి.



కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుంది

- కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ఇప్పటికే దేవదాయ శాఖ భూములకు సం బంధించి ఆ శాఖ కమిషనర్‌తో సంప్రదింపులు జరిపిన అనంతరం మరింత పురోగతి రానుందని తెలిపారు. ప్రాధాన్యతాక్రమంలో భూసేకరణ చేపట్టి అవార్డు తదితర దశలు పూర్తి చేసి భూము లను రైల్వే శాఖకు అప్పగిస్తామన్నారు. విజయవాడ స్వరాజ్య మైదానంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగే అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు జిల్లా నుంచి 116 బస్సుల్లో ప్రజలను తీసుకెళ్తున్నట్టు ఆయన తెలిపారు. తొలుత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అమరావతి నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ జిల్లాలో మూడో దశ రీ సర్వే ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నామ న్నారు. చిట్టచివరి లబ్ధిదారునికి సైతం ఆరోగ్యశ్రీ కార్డు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, నోడల్ అధికారి కె.భీమేశ్వర్, సీపీవో వెంకటేశ్వర్లు, సర్వే-ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కె.ప్రభాకర్, డీపీవో వి.కృష్ణకుమారి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

6796 మందికి రూ.89.24 లక్షల చెక్కు...

పేదలందరికీ ఇళ్ల నిర్మాణానికి స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు తీసుకున్న రూ.35 వేలు రుణాలపై వడ్డీ భారం లేకుండా రీయింబర్స్‌మెంట్ చేస్తామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. సీఎం జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వడ్డీ రీయింబర్స్‌మెంట్ మొదటి దశ నిధులను బటన్ నొక్కి లబ్ధిదారులైన మహిళల ఖాతాలకు జమ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 6,796 మంది మహిళా లబ్ధిదారులకు రూ.89,24,081 నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయగా సంబంధిత చెక్కును కలెక్టరేట్‌లో ఆయన అందజేశారు. కార్యక్రమంలో అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, గృహ నిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావు, డీపీఎం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభా స్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

మండపేటలో రేపే రా... కదలిరా! బహిరంగ సభ

- హాజరు కానున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు
- సభా స్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలించిన ఆ పార్టీ నేతలు

మండపేట, జనవరి 18: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం మండపేటలో నిర్వహించే 'రా కదలిరా' బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రులు గొల్లపల్లి సూర్యారావు, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప, నిమ్మల రామానాయుడు, శాసనమండలి మాజీ డిప్యూటీ స్పీకర్ రెడ్డి సుబ్రహ్మణ్యం టీడీపీ, జనసేన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడమే టీడీపీ-జనసేన ప్రధాన ఎజెండా అన్నారు. ఆలమూరు-మండపేట రోడ్డులోని బహిరంగ సభా స్థలిని టీడీపీ నేతలు గురువారం పరిశీలించారు. హెలిపాడ్, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను కూడా చూశారు. వచ్చిన వారికి ఇబ్బంది కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై నేతలు చర్చించి పలు సూచనలు చేశారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సారథ్యంలో జరిగిన సమావేశంలో పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, కాకినాడ పార్లమెంటరీ ఇన్‌చార్జి జ్యోతుల నవీన్, మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, అయితాబత్తుల ఆనందరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బండారు సత్యానందరావు, వనమాడి కొండబాబు, చిన్నం బాబూరమేశ్, మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి. టీడీపీ రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, జోన్-2 ఇన్‌చార్జి వై.రవికుమార్, మోకా ఆనందసాగర్, మెట్ల రమణబాబు, రెడ్డి ప్రసాద్, మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వల్లూరి సాయికుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు రోజులు దగ్గరపడ్డాయి: నిమ్మల రామానాయుడు

రాష్ట్రంలో జగన్ పాలనకు రోజులు దగ్గరపడ్డాయని టీడీపీ సీనియర్ నేత, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. దళితులకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేయడమే కాక అంబేడ్కర్ విద్యా పథకం పేరులో అంబేడ్కర్ పేరు తొలగించి జగన్ తన పేరు పెట్టుకుని అంబేడ్కర్‌ను అవమానపరిచారన్నారు. అటువంటి మహనీయుడి సీఎం ప్రారంభించడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల ముందు కోడి కత్తి డ్రామాతో అధికారంలోకి వచ్చిన జగన్ ఇప్పటివరకు శ్రీనుకు బెయిల్ రాకుండా చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. శ్రీను, అతడి కుటుంబసభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా దీక్షలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో దళితులకు, బడుగుబలహీనవర్గాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. చంద్రబాబు తలపెట్టిన 'టీడీపీ పిలుస్తోంది... రా కదలిరా' సభలకు ప్రజా స్పందన విశేషంగా వస్తోందన్నారు. మండపేట బహిరంగ సభను టీడీపీ-జనసేన సంయుక్తంగా నిర్వహిస్తాయన్నారు.

బాబు పర్యటన ఇలా...

శనివారం మధ్యాహ్నం 2.55 గంటలకు మండపేట బైపాస్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో దిగుతారు. 3.05 గంటలకు బయల్దేరి 3.10 గంటలకు బహిరంగ సభా స్థలికి చేరుకుంటారు. 3.15 నుంచి 4.30 గంటల వరకు బహిరంగ సభలో మాట్లాడతారు. 4.35 బయల్దేరి హెలికాప్టర్‌లో రాజమహేంద్రవరం వెళ్తారు.

'వేరే గ్రామంలో భూములున్న రైతుల కోసమే ఆర్బీకేలు'

అమలాపురం రూరల్, జనవరి 18: గ్రామాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటల విస్తీర్ణం తక్కువగా ఉన్నప్పటికీ వేరొక గ్రామంలో భూములు ఉన్న రైతుల ఉన్న కారణంగా ఆర్బీకేలు నిర్మించినట్టు జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'భూములు లేనిచోట ఆర్బీకేలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు కూడా నియామకం' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు ఆయన వివరణ ఇచ్చారు. మండలంలో 26 ఆర్బీకేలు ఉండగా ఇప్పటికి 14 పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఆర్బీకే పరిధిలో ఉన్న రైతులకు వేరొక గ్రామంలో భూమి ఉండవచ్చని, వారికి వ్యవసాయ శాఖ తరపున సలహాలు, సూచనలు అందిస్తామని చెప్పారు.





ఐసీడీఎస్ అమలాపురం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట బారులు తీరిన అంగన్‌వాడీలు, కలెక్టరేట్ ఎదుట దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ రావు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే తీరిక లేదా: ఎమ్మెల్సీ ఐవీ

అమలాపురం టౌన్, జనవరి 18: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించే తీరిక ప్రభుత్వానికి లేదా అని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు విమర్శించారు. అంగన్‌వాడీలు 38 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా దానిని విరమింపచేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవట్లేదన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న ప్రధాన డిమాండుతోనే అంగన్‌వాడీలు సమ్మెకు దిగారని గుర్తు చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా నాలుగేళ్ల వ్యవధిలో రెండు రెట్లు పెరిగిపోయిన విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె శిబిరాన్ని గురువారం కొనసాగించారు. ఎమ్మెల్సీ ఐవీతో పాటు యూటీఎఫ్ నాయకురాలు పీఎస్ శిరోమణి సందర్శించి సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరంలో అంగన్‌వాడీల సంఘం జిల్లా కోశాధికారి పి.అమూల్య, ప్రాజెక్టు ప్రతినిధులు కె.బేబీగంగారత్నం, ఎం.విజయలక్ష్మి, రత్నకుమారి, ఎ.సీత, దైవకృప, పార్వతి, పరిపూర్ణ, మణిమాల, సుశీల పాల్గొన్నారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం తరపున అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గడువులోగా సమాధానం ఇవ్వాలన్నారు. వ్యక్తిగతంగా కాకుండా మూకుమ్మడిగా షోకాజ్ నోటీసులు ఇవ్వడంపై వివరణ ఇస్తూ గురువారం ఐసీడీఎస్ అమలాపురం ప్రాజెక్టు కార్యాలయం వద్దకు అంగన్‌వాడీలు చేరుకుని క్యూ కట్టారు. వాటిని కార్యాలయంలో అందజేశారు.

అల్లుడా... మజాకా!

408 రకాల పిండి వంటలతో విందు భోజనం

ఆపై అనేక కానుకల సమర్పణ

రాజోలు, జనవరి 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన కాసు శ్రీనివాస్-భవానీ దంపతుల కుమారుడు కాసు సుబేష్‌కు గత ఏడాది సెప్టెంబరు 2న పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురానికి చెందిన చుండూరి సుబ్రహ్మణ్యం-శ్రీలక్ష్మి కుమార్తె శ్రీరంగనాయకితో వివాహమైంది. అల్లుడు, కూతుర్ని సంక్రాంతికి సుబ్రహ్మణ్యం నర్సాపురం ఆహ్వానించి అతిథి మర్యాదలతో సత్కరించి 408 రకాల పిండి వంటలతో విందు భోజనం ఏర్పాటుచేశారు. అల్లుడి, కూతురికి అనేక కానుకలు ఇచ్చారు.






తుని పరిసర ప్రాంతంలో దట్టంగా కమ్ముకున్న మంచు

మంచు కురిసే వేళలో..

తుని రూరల్, జనవరి 18: దట్టంగా కురుస్తున్న పొగ మంచు రహదారులను కమ్మేస్తోంది. వాహనదారులకు రోడ్లు కనపడడం లేదు. ఉదయం ఎనిమిది దాటినా మంచు కురుస్తూనే ఉంది. వాహనదారులు లైట్ల వెలుగుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. తుని పరిసర ప్రాంతాల్లో పొగ మంచు కురుస్తున్న దృశ్యాలు కనువిందు చేశాయి.

కన్యాకుమారి వరకు యాత్ర

కడియం, జనవరి 18: ఉత్తరప్రదేశ్‌కు చెందిన నితిన్‌చౌదరి, ప్యూస్‌చౌదరి హిందూ ప్రచారానికి ప్రాధాన్యమిస్తూ చేపట్టిన యాత్ర గురువారం కడియం చేరుకుంది. మధుర ప్రాంతం నుంచి గత ఏడాది 20వ తేదీన మోటారుసైకిల్‌పై యాత్ర ప్రారంభించారు. జనవరి 26వ తేదీ రిపబ్లిక్ డే నాటికి కన్యాకుమారికి చేరుకుంటామని వారు తెలిపారు. దేశంలో ఏఏ దేవాలయాలు ఉన్నాయి? ఆయా ప్రాంతాల్లో భక్తి భావాలు ఎలా ఉంటాయి? అనే వాటికి ప్రాధాన్యమిస్తూ యాత్ర చేపట్టినట్టు తెలిపారు. కన్యాకుమారి నుంచి ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకుంటూ ఉత్తరప్రదేశ్ చేరుకుంటామన్నారు. విశాఖపట్నం, కాకినాడ మీదుగా కడియం చేరుకున్నామని, రాజమండ్రి, ఏలూరు మీదుగా విజయవాడ వెళతామన్నారు. బీటీప చదువుకున్న వీరిద్దరూ ఈ యాత్ర అనంతరం రాముడు పయనించిన అయోధ్య నుంచి శ్రీలంక వరకు యాత్ర చేపడతామన్నారు.



కోడికత్తి శ్రీనుకు బెయిల్ రాకుండా జగన్ అడ్డుకుంటున్నారు

అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్



దీక్ష చేస్తున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18 : కోడికత్తి శ్రీనును వెంటనే విడుదల చేయాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ డిమాండ్ చేశారు. కోడికత్తి శ్రీను వైజాగ్ జైలులో చేపట్టిన నిరవధిక దీక్షకు మద్దతుగా రాజమహేంద్రవరంలోని తన నివాసంలో గురువారం ఆయన సంఘీభావ దీక్ష చేశారు. ఐదేళ్ల నుంచి 307 సెక్షన్ కేసు మీద కోడికత్తి శ్రీను జైలులో మగ్గుతున్నాడన్నారు. కనీసం అతనికి కోర్టులు బెయిల్ మంజూరు చేయడం లేదన్నారు. 307 కేసులో విచారణ జరపకుండా ఇంత కాలం బెయిల్ ఇవ్వకుండా ఉండడం అనేది స్వాతంత్ర భారతదేశ చరిత్రలో ఇదే మొట్టమొదటి కేసు అని అన్నారు. ఇది చంపాలని చేసింది కాదన్నారు. దీని వల్ల జగన్ లాభం పొందుతాడని శ్రీను ఈ పని చేశాడన్నారు. దీని వెనుక ఎలాంటి కుట్ర లేదని ఎన్ఐఏ చెప్పిందన్నారు. అయినా శ్రీనుకు బెయిల్ ఇవ్వలేదన్నారు. దీనిపై సుప్రీంకోర్టు ఆలోచన చేయాలన్నారు. ఎంత అధికారం ఉంటే మాత్రం ఇలా బెయిల్ రాకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. జగన్ వచ్చాక దళితులపై దాడులు పెరిగాయన్నారు. జగన్ కోర్టుకు వచ్చి వాంగ్మూలం ఇవ్వకపోతే వెంటనే ఆయనకు ఎన్‌బీడబ్ల్యూ ఇచ్చి కోర్టుకు రప్పించాలన్నారు. రాకపోతే వెంటనే అరెస్టు చేయాలన్నారు. నిజంగా జగన్‌కు క్షమాగుణం ఉంటే కోర్టుకు రావాలన్నారు. కోడికత్తి శ్రీను కుటుంబం చాలా ఇబ్బందుల్లో ఉందని అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కందుల దుర్గేష్‌కు పరామర్శ



దుర్గేష్‌ను పరామర్శిస్తున్న నాదెండ్ల మనోహర్



దుర్గేష్‌తో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18: జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్‌ను ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి నాదెండ్ల మనోహర్ పరామర్శించారు. సతీవియోగంతో బాధపడుతున్న దుర్గేష్‌ను జేఎన్ రోడ్డులోని నివాసంలో గురువారం కలిశారు. ఉషారాణి చిత్రపటానికి నివాళులర్పించారు. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చిన రాజప్ప, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణ్యం, బొల్లినేని హాస్పటల్ వైద్యుడు రామరాజు, రామ్మోహనరావు, చవ్వాకుల కుమార్ తదితరులు పరామర్శించారు.

పోలీసులపై అసత్య ఆరోపణలు తగవు

పెద్దాపురం, జనవరి 18 : పోలీసులపై లేనిపోని ఆరోపణలు తగవని డీఎస్పీ కె.లతాకుమారి అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె గురువారం మాట్లాడారు. రాజులపూడి ఆరుద్ర అనే మహిళ ఇటీవల పోలీసులపై చేసిన ఆరోపణలను ఆమె ఖండించారు. ఆరుద్ర తన ఇంటిని విక్రయించే విషయంలో ఆరోపణలు చేసిన కానిస్టేబుళ్లు మెరపల వీరవెంకట సత్యనారాయణ అలియాస్ శివ, మెరపల నాగకన్నయ్యతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు అయిన ముత్యాలరావు, న్యాయవాది చిట్టిబాబుపై అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో కేసును సైతం నమోదు చేశామన్నారు. ఆరుద్ర చేసిన ఆరోపణల నేపథ్యంలో ఇద్దరు డీఎస్పీ స్థాయి అధికారులను విచారణకు నియమించామన్నారు. అలాగే దర్యాప్తు తుది దశలో ఉన్న కారణంగా నివేదికను ఉన్నతాధికారులకు అందించన తర్వాత వారి ఆదేశాల మేరకు సంబంధిత వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం

రామచంద్రపురం, జనవరి 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణం ప్రధాన రహదారి ప్రాఫిట్ షూమార్ట్ ఎదురుగా బుధవారం రాత్రి మారుతి 800 కారులో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న విద్యుత్‌నగర్‌కు చెందిన రాంబాబు, ఆయన ఇద్దరు పిల్లలు ఏటీఎం నుంచి డ్రా చేసిన రూ.లక్ష నగదుతో బయటకు వచ్చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మంటలను పట్టణ ఫైర్ సిబ్బంది అదుపు చేశారు. రాత్రి వేళ ప్రధాన రహదారిలో ఈ ఘటన జరగడంతో ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.



మారుమూల ప్రాంతాలకూ సంక్షేమ ఫలాలు

కేంద్ర ఆయుష్, శిశు సంక్షేమ శాఖ మంత్రి మహేంద్ర ముంజపార

పిఠాపురం రూరల్, జనవరి 18: కేంద్రం అమలు చేస్తున్న పథకాల సంక్షేమ ఫలాలు మారుమూల ప్రాంత ప్రజలకు చేరాలన్నదే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఆయుష్, శిశు సంక్షేమ శాఖ మంత్రి మహేంద్ర ముంజపార తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కందరాడ గ్రామంలో గురువారం నిర్వహించిన సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ 2047 నాటికి ప్రపంచంలో అభివృద్ధిలో దేశం అగ్రగామిగా ఉండాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ద్వారా 12 కోట్ల కుటుంబాలు రూ.5 లక్షల మేర ఆరోగ్య ప్రయోజనాన్ని పొందుతున్నాయని తెలిపారు. ఈ పథకం ద్వారా దేశంలోని 26 వేల ప్రభుత్వ, 4,692 ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందవచ్చునని చెప్పారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా దారిద్ర్యరేఖను దిగువన ఉన్న 5.12 కోట్ల మహిళలకు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామని తెలిపారు. గరీబ్ కల్యాణ్ అన్నయోజన పథకం ద్వారా ప్రతి వ్యక్తికి అయిదు కిలోల బియ్యాన్ని ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. పీఎం పోషణ్ అభియాన్ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలకు పోషకాహారాన్ని అందజేస్తున్నామని, జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత నీటిని అందిస్తున్నామని వివరించారు. ప్రతి పథకంలోని లక్ష్యాలు, పురోగతిని ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం బాలామృతం ద్వారా చిన్నారులకు ఆహారాన్ని అందించగా, ఉజ్వల యోజన పథకం ద్వారా మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, జిల్లా జాయింట్ కలెక్టరు ఇలాక్కియ, వికసిత్ భారత్ సంకల్పయాత్ర రాష్ట్ర కోఆర్డినేటర్ వేటుకూరి సూర్యనారాయణరాజు, జడ్పీ సీఈవో అబ్బిరెడ్డి రమణారెడ్డి, డీపీవో కె.భారతిసౌజన్య, కందరాడ సర్పంచ్ నాగభారతి, బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన, కార్యదర్శులు చిలకూరి రామకుమార్, గండి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ కనెక్షన్ అందిస్తున్న కేంద్ర మంత్రి మహేంద్ర ముంజపార

సందేశాత్మకంగా సాగిన నాటికలు

భోగాపురంలో జాతీయ స్థాయి నాటికల పోటీలు

పిఠాపురం , జనవరి 18: కుటుంబ సంబంధ బాంధవ్యాల గొప్పతనాన్ని చాటిచెబుతూ ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. భోగాపురం నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురంలో జరుగుతున్న జాతీయ స్థాయి నాటికల పోటీలు రెండో రోజు సందేశాత్మకంగా సాగాయి. ఒకే కడుపున పుట్టిన అన్నచెల్లెలు మధ్య ప్రేమ, అనుబంధం గురించి తెలియచెబుతూ గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు అమృతహస్తం నాటికను ప్రదర్శించారు. నేటి ఆధునిక సమాజంలో కనుమరుగవుతున్న విలువల నేపథ్యంలో ఇలాంటి బంధాలు ఎంత అవసరమో తెలియజెప్పారు. కష్టకాలంలో చెల్లికి అండగా ఉండే అన్న, వారి కుటుంబాన్ని చక్కదిద్దిన వైనం గురించి నాటిక ద్వారా వివరించారు. కావూరి సత్యనారాయణ రచించిన ఈ నాటికకు ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు.

పెళ్లంటే సర్దుబాటు, సంసారమంటూ దిద్దుబాటు అనే విషయాన్ని వివరిస్తూ గుంటూరు అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన నాన్నా..నేనొచ్చేస్తా నాటిక సందేశాత్మకంగా సాగింది. తల్లిదండ్రులు తమ పిల్లలుకు అడిగిందల్లా కాదనకుండా ఇచ్చేస్తూ వారిపై మితిమీరిన మమకారాన్ని వాత్సల్యాన్ని ప్రదర్శిస్తున్నారు. దీని ఫలితంగా పెళ్లయిన తర్వాత తమ వైవాహిక బంధంలో వచ్చే చిన్న సమస్యలనే పరిష్కరించుకోలేకపోతున్నారు. పెళ్లైన కూతురు నాన్నా నేనొచ్చేస్తా అనే మాటకు స్వస్తి పలికి నాన్నా మీరు మా ఇంటికి ఎప్పుడు వస్తారు అనే పరిస్థితి రావాలని ఈ నాటిక ద్వారా సందేశాన్ని ఇచ్చారు. గంటి రాజేశ్వరి మూల కథను రాయగా, తాళాబత్తుల వెంకటేశ్వరరావు నాటకీకరణ చేయగా, అమృత లహరి దర్శకత్వం వహించారు. నాటికల ప్రదర్శన ఏర్పాట్లను కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు తదితరులు పర్యవేక్షించారు.



అమృతహస్తం నాటికలో ఓ దృశ్యం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న జేఎన్టీయూకే వీసీ ప్రసాదరాజు

జేఎన్టీయూకే వీసీ ప్రసాదరాజు

జేఎన్టీయూకే, జనవరి 18: ప్రస్తుత విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించి సరికొత్త ఆవిష్కరణలు చేపట్టి సమాజాభివృద్ధికి కృషి చేయాలని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు సూచించారు. వర్సిటీలోని సెనేట్ హాల్లో జేఎన్టీయూకే ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్)డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ రీఫార్మ్స్, ఇన్నోవేషన్ ఎంటర్ ప్రెన్యూరియల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ప్రసాదరాజు, రీసోర్స్ పర్సన్‌గా బెంగళూరులోని జేవీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ రీసెర్చ్ డీన్ ఎన్ఎంకే భట్టా, హైదరాబాద్‌లోని నార్సిమోంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అడ్మిషన్స్ విభాగాధిపతి బి.పాండురంగారావు, అతిథులుగా రిజిస్ట్రార్ ఎల్.సుమలత పాల్గొనగా ముఖ్యఅతిథి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా ఓడీయల్ డైరెక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థులు వ్యవస్థాపకులుగా వినూత్న ఆవిష్కరణలు చేపట్టే సమయంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని విజయం సాధించాలన్నారు. ఎన్ఎంకే భట్టా మాట్లాడుతూ విద్యార్థి దశలో వారికి లభించే అవకాశాల గురించి చాలా మందికి తెలియదని వాటిని తెలుసుకుని అందిపుచ్చుకోగలిగితే విజయం దానంతటదే వస్తుందన్నారు. అనంతరం పాండురంగారావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉన్నత విద్యలో తీసుకువస్తున్న సంస్కరణలు గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.కృష్ణభాస్కర్, జేవీఆర్ మూర్తి, విభాగాధిపతులు, విశ్వవిద్యాలయ, అనుబంధకళాశాలల నుంచి అధ్యాపకులు. విద్యార్థులు పాల్గొన్నారు.

2 లక్షల మందితో రా కదలిరా సభ

జన సమీకరణపై టీడీపీ నేతల చర్చలు

మండపేట, జనవరి 18: మండపేటలో ఈ నెల 20న జరిగే టీడీపీ రా కదలిరా బహిరంగ సభకు కోనసీమ జిల్లాల్లోని 7 నియోజకవర్గాల నుంచి 2 లక్షల మంది హాజరయ్యే విధంగా టీడీపీ నేతలు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు గురువారం మండపేట పట్టణంలో బాబు అండ్ బాబు కన్వెన్షన్ హాల్‌లో పార్లమెంట్ పరిధిలో గల టీడీపీ ఇన్‌చార్జులతో టీడీపీ సీనియర్ నేతలు సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రామచంద్రపురం ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం నియోజకవర్గాల వారీగా జన సమీకరణకు సంబంధించి వివరాలు వెల్లడించారు. రాజోలు, గన్నవరం, అమలాపురం, కొత్తపేట నుంచి వచ్చే వాహనాలను ఆలమూరు రోడ్డులో పార్కింగ్ చేసేలా స్థలాన్ని కేటాయించారు. ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట నుంచి వచ్చే వాహనాలకు చంద్రబాబునాయుడు సభాస్థలికి కూతవేటు దూరంలో పార్కింగ్ ప్రదేశాన్ని ఏర్పాటు చేశారు. చంద్రబాబు నాయుడు మండపేట ఆలమూరు బైపాస్‌రోడ్డులో పరిధిలో ఉన్న ఏడిద రోడ్డు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగిన తర్వాత ఆయన నేరుగా బైపాస్ రోడ్డు నుంచి సభస్థలికి చేరుకునేలా రూట్ ఏర్పాటు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

సత్యదేవుని సన్నిధిలో సర్వర్ సమస్య

కొద్దిసేపు నిలిచిపోయిన వ్రతం, దర్శనం టిక్కెట్ల విక్రయాలు

అన్నవరం, జనవరి 18: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో గురువారం సర్వర్ సమస్యతో కొద్దిసేపు వ్రతం టిక్కెట్లు, దర్శనం టిక్కెట్ల విక్రయాలు నిలిచిపోయాయి. దీంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. సమస్య తీవ్రతరం కాకుండా టిమ్స్ ద్వారా టిక్కెట్లు జారీ చేశారు. మధ్యాహ్నానికి సర్వర్‌లు యథావిధిగా పనిచేయడంతో సేవలు కొనసాగించారు. అయితే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయడం కోసం విజయవాడలో నెలకొన్న సమస్య మాత్రమేనని ఇక్కడ నుంచి ఎటువంటి ఇబ్బందులు లేవని అధికారులు తెలిపారు. కొద్దిసేపటికి అంతా మామూలైందని ఈ సందర్భంగా తెలిపారు.

భార్యే హంతకురాలు

● ప్రియుడితో కలిసి హత్య చేసిన వైనం ● ఇద్దరినీ అరెస్టు చేసిన పోలీసులు

పిఠాపురం రూరల్, జనవరి 18: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం విరవాడలో సంచలనం కలిగించిన హత్య కేసు మిస్టరీ వీడింది. ఓ వ్యక్తి హత్యకు కారణమైన అతని భార్యతో సహా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం పిఠాపురం సీఐ శ్రీనివాస్ వెల్లడించారు. విరవాడ ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న సిద్ధాంతపు చినఅప్పారావు 10వ తేదీ రాత్రి హత్యకు గురయ్యాడు. దీంతో అతని సోదరి దాకే మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌బాబు ఆదేశాల మేరకు కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఖమ్మంలోని ఇటుక బట్టీల్లో పనిచేసే సమయంలో చినఅప్పారావు భార్య తుని మండలం హంసవరం గ్రామానికి చెందిన సిద్ధాంతపు చిన్నారి, గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన నురుకుర్తి సురేష్ మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో మూడేళ్ల క్రితం అప్పారావు తన కుటుంబాన్ని తీసుకుని విరవాడ ఇటుకల బట్టీలో పనికి చేరాడు. అయినప్పటికి చిన్నారి, సురేష్‌ల మధ్య సంబంధం కొనసాగడంతో అప్పారావు, అతడి భార్య చిన్నారి మధ్య పలుమార్లు వాగ్వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో అప్పారావును అడ్డు తొలగించుకుని ఎక్కడికయినా పారిపోవాలని చిన్నారి,సురేష్ నిర్ణయించుకుని హత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఇరువురు కత్తితో అప్పారావును విచక్షణారహితంగా నరికి హత్య చేసినట్లు విచారణలో వెల్లడయిందని తెలిపారు. వారిద్దరిని అరెస్టు చేసి కత్తి, రక్తపు మరకల దుస్తులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఇకపై గుంటూరు వరకు ఉదయ్ ఎక్స్‌ప్రెస్

సామర్లకోట, జనవరి 18: విశాఖపట్నం-విజయవాడ-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగిస్తున్న ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలును గుంటూరు వరకూ పొడిగిస్తూ రైల్వే ఉన్నతాధికారి సమాచారాన్ని విడుదల చేశారు 22701, 22702 నంబర్లతో ఈ ఎక్స్‌ప్రెస్ రైలు సోమ, మంగళ, బుధ, శుక్ర, శనివారాలలో రాకపోకలు సాగిస్తుంది. 22702 నంబరు గల గుంటూరు-విశాఖ మధ్య రాకపోకలు సాగించే ఈ ఎక్స్‌ప్రెస్ రైలు గుంటూరులో సాయంత్రం 4 గంటలకు బయలుదేరి విజయవాడకు 5.15 గంటలకు చేరుకుంటుంది. ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా రాజమండ్రికి రాత్రి 7.28కి చేరుకుని సామర్లకోటకు 8.18కి చేరుతుంది. తునికి 9.04కి చేరుకుని అనకాపల్లి, దువ్వాడ మీదుగా విశాఖపట్నానికి రాత్రి 10.55కి చేరుతుంది.

22701 నంబరు గల విశాఖ -గుంటూరు మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు విశాఖపట్నంలో తెల్లవారుజామున 5.20 గంటలకు బయలుదేరి దువ్వాడ, అనకాపల్లి మీదుగా తునికి ఉదయం 6.59కి చేరుతుంది. సామర్లకోటకు 7.48కి చేరుకుని రాజమండ్రికి 8.33కి చేరుతుంది. తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ మీదుగా గుంటూరుకు మధ్యాహ్నం 1.00 గంటకు చేరుతుంది. మరిన్ని వివరాలకు సమీప రైల్వే స్టేషన్లలో సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారి తెలిపారు. ఇదిలా ఉండగా 17481 నంబరు గల బిలాస్‌పూర్-తిరుపతి మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 20,23,27లలో రద్దు చేసినట్లు రైల్వే అధికారి తెలిపారు.

17482 నంబరు గల తిరుపతి-బిలాస్‌పూర్ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 21,25 తేదీలలో రద్దు చేశారు. 17243 నంబరు గల గుంటూరు-రాయగడ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 19 నుంచి 26 వరకూ విజయనగరం వరకే నడుస్తుందని తెలిపారు. 17244 నంబరు గల రాయగడ-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 20 నుంచి 27 వరకూ విజయనగరం-గుంటూరు మధ్య మాత్రమే నడుస్తుంది.

చలి మంట అంటుకుని

గిరిజనుడి మృతి



ఎటపాక, జనవరి 18: ప్రమాదవశాత్తు చలి మంట అంటుకుని గిరిజనుడు మృతి చెందాడు. ఎటపాక మండలం విస్సాపురం పంచాయతీ, బండారుగూడెం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ విషాదకర సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన కుడియం కన్నయ్య (45) రోజు మాదిరిగానే మంచం పక్కన చలిమంట రాజేసి, నిద్రిస్తుండగా కప్పుకున్న దుప్పటి ప్రమాదవశాత్తు చలిమంటపై పడి కన్నయ్యకు నిప్పంటుకుంది. కొద్దిసేపటికి తేరుకుని కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ తెల్లవారుజామున కన్నయ్య మృతి చెందాడు. ఎస్ఐ కర్రి పార్థసారధి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య



రావులపాలెం, జనవరి 18: సాగు కోసం చేసిన అప్పులతో మనస్తాపంతో ఓ కౌలు రైతు పురుగుల మందు తాగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం కొమరాజులంకకు చెందిన పిండ్ర రామకృష్ణ (గాంధీ) (76) కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అల్లుడు చనిపోవడంతో కుమార్తె, ఆమె పిల్లలు ఈయనతోనే ఉన్నారు. ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో పెద్ద కుమారుడు ఇంటి వద్దనే ఉంటున్నాడు. తండ్రి, కుమారులు కలిసి పంట సాగు చేసేందుకు అప్పులు చేశారు. ఇటీవల కాలంలో వ్యవసాయం కలిసిరాకపోవడంతో రామకృష్ణ మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. బంధువులు కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్య నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రామకృష్ణ మృతిపై పిండ్ర లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అంజనేయులు చెప్పారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



పిఠాపురం, జనవరి 18: కాకినాడ జిల్లా పిఠాపురంలోని బైపాస్‌రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. కత్తులగూడెం ప్రాంతంలో నివాసముంటున్న జోగా త్రిమూర్తులు(70) మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా బైపాస్ విరవాడ జంక్షన్ వద్ద కత్తిపూడి నుంచి కాకినాడ వెళ్లుతున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో త్రిమూర్తులు తీవ్రంగా గాయపడగా, హైవే అంబులెన్స్‌లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. పిఠాపురం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

గిడుగు రుద్రరాజు జన్మదిన వేడుకలు

అమలాపురం టౌన్, జనవరి 18: సీడబ్ల్యుసీ ప్రత్యేక ఆహ్వానితునిగా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. హరిమనోవికాస కేంద్రంలో జిల్లా శాఖ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో రుద్ర రాజు జన్మదిన వేడుకల కేక్ కట్ చేసి పిల్లలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, ముషిణి రామకృష్ణారావు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు అయితాబత్తుల సుభాషిణి పాల్గొన్నారు.

- టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ వర్ధంతి
- నివాళులర్పించిన పార్టీ నాయకులు
- మండలాల్లో పలు సేవా కార్యక్రమాలు

సంక్షేమ పథకాల అమలుకు ఆద్యుడు ఎన్టీఆర్

అమలాపురం టౌన్/రూరల్, జనవరి 18: దేశంలో సంక్షేమ పథకాలను అమలుచేసిన ఘనత టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని టీడీపీ నియోజకవర్గ కార్యాలయం, గడియార స్తంభం సెంటరు, నల్లవంతెన, హౌసింగ్‌బోర్డు కాలనీల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్రకార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, నాయకులు తిక్కిరెడ్డి నేతాజీ, కర్రి రామస్వామి, నల్లా స్వామి, భాస్కర్ల రామకృష్ణ, బత్తుల ప్రసాద్, పెద్దిరెడ్డి పుల్లయ్యనాయుడు, పలివెల శ్రీను, కొప్పుల బాబి, పట్నాల రమణ, ముత్తాబత్తుల రమణ పాల్గొన్నారు. అమలాపురం రూరల్ బండారులంక, కామనగరువుల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. బండారులంకలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, మాజీ ఎంపీటీసీ మాడా మాధవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులంతా పాల్గొన్నారు. 600మంది పేదలకు మాజీ ఎమ్మెల్యే ఆనందరావు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారి బాబ్జీ, బళ్ల వెంకటేశ్వరరావు, బండి సుబ్బారావు, బళ్ల శ్రీనివాస చక్రవర్తి, కాశిన బాబి, బళ్ల వీర్రాజు, యిను మర్తి సతీష్, జనసేన నాయకుడు బట్లు పండు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురం గ్రామ టీడీపీ అధ్యక్షుడు నామాల బొజ్జియ్య అధ్యక్షతన నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కె.గంగవరం: కె.గంగవరం, పాణింగపల్లి, బ్రహ్మపురి గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమాల్లో పార్టీ సీనియర్ నాయకులు చుండ్రు వీర్రాజు చౌదరి, మేడిశెట్టి రవికుమార్, చింతపల్లి వీరభద్రరావు, కొత్తపల్లి ముర్రార్జీ, బలుసు నాగేంద్ర, జగతా రమణ, చొల్లంగి ఎదుర్లయ్య, మరివాడ చిన్నికృష్ణ, గన్ని శ్రీను, బలుసు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాధుర్ పూలమాలలువేసినివాళులర్పించారు. పుల్లేటికుర్రు, అంబాజీపేట, కె.పెదపూడి, నందంపూడి తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పలువురు నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. పుల్లేటికుర్రులో ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు వక్కలంక బుల్లియ్య ఆధ్వర్యంలో దుప్పట్లను పేదలకు అందించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దంతులూరి శ్రీనురాజు, కార్యదర్శి గుడాల ఫణి, దాసరి వీరవెంకట సత్యనారాయణ, నాగాబత్తుల సుబ్బారావు, బొంతు పెదబాబు, చిన్నంబాలవిజయరావు, దొమ్మేటి శ్యామ్, మిద్దెల శ్రీను, యడ్లపల్లి తుక్కియ్య, మంద రాజేష్, రవణం రాము, కొప్పినీడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: పేరవరంలో టీఎన్టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముళ్ళపూడి భాస్కరరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆత్రేయపురంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు ఆధ్వర్యంలో, నార్కెడిమిల్లిలో మద్దింశెట్టి వీరవెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో, లొల్లలో కాయల జగన్నాథం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. పలు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు కరుటూరి నరసింహరావు, కుదప కృష్ణమూర్తి, దొడ్డపనేని త్రినాథ్, శ్రీధర్, కవల సత్తిబాబు, తోట రజని, జాన అంజి పాల్గొన్నారు.





రాజోలు: ఎన్టీఆర్‌కు నివాళులర్పించిన గొల్లపల్లి, రామచంద్రపురం: నివాళులర్పిస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

ఆలమూరు: స్థానిక బస్టాండు సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు కడియాల శ్రీనివాస్, ఈదల నల్లబాబు, వంటిపల్లి సతీష్, ఈదల సత్తిబాబు, రామానుజుల శేషగిరిరావు, సాలి సత్యనారాయణ, అనుసూరి నాగరత్నం, భవానీ, వక్కపట్ల లక్ష్మణరావు, చీపురుపల్లి గణేష్ పూలమాలలు వేశారు. చొప్పెల్లలో టీడీపీ మండల అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, నైనాల శ్రీరామచంద్రమూర్తి,గుమ్మిలేరులో యార్లగడ్డ రమేష్‌చౌదరి, అమూజూరు శ్రీను, జొన్నాడలో తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి బాబీ, కె.సునీల్ ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. చింతలూరు, మడికి, మోదుకూరు, పెదపళ్ల, పెనికేరు గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు.

మామిడికుదురు: మామిడికుదురు బస్టాండు కూడలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, నాయకులు ఈలి శ్రీనివాస్, మద్దాల కృష్ణమూర్తి, బోనం బాబు, సూదా బాబ్జి, వర్ధినేని వెంకట్రామయ్య, సాపే ఏకాదశి, పెచ్చెట్టి భాస్కరరావు, జాలెం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: జి.మూలపొలంలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద నివాళులర్పించారు. సాగిరాజు సూరిబాబురాజు, సంగాని మీరబాబు, లంకే శ్రీను, ఓలేటి వెంకట్రావు, ముదునూరి కృష్ణంరాజు, గంగుల శేషారావు, ఉండ్రు గంగాద్రి, తోటకూర సూరపరాజు, లంకే ధనకాసులు, మెల్లం సత్యనారాయణ పాల్గొన్నారు.

రాయవరం: గ్రామాల్లో గురువారం ఎన్టీఆర్‌కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నేతలు వైఆర్కే పరమహంస, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, చుండ్రు వీర్రాజు, దేవు వెంకట్రాజు, మేడపాటి రవీంద్రారెడ్డి, కర్రి వెంకటరామకృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ఎన్టీఆర్ వర్ధంతిని ముమ్మిడివరంలో టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పోలమ్మచెరువుగట్టున ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి దాట్ల బుచ్చిబాబు అధ్యక్షతన జరిగిన సభలో మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, నాగిడి నాగేశ్వరరావు, తాడి నరసింహారావు, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, చిక్కాల బాబులు, సాగిరాజు సూరిబాబురాజు, నడింపల్లి సుబ్బరాజు, చిక్కాల అంజి, గొల్లపల్లి గోపి, మిమ్మితి చిరంజీవి, దాట్ల బాబు, యాళ్ల ఉదయ్, కురసాల శివ, మెండి కమల, బొంతు నాగరాజు పాల్గొన్నారు.

రావులపాలెం: గోపాలపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు. ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అధికారి నాగు, ఆకుల శ్రీనివాస్, మైగాపుల రవితేజ, యాళ్ళ మునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో వేగిరాజు వెంకట్రాజు, కడలి వెంకటేశ్వరరావు, చింతా శ్రీనివాస్, కొల్లు విష్ణుమూర్తి, వేగిరాజు సుబ్బరాజు, యాళ్ల కాసుబాబు, పోతుల నాగరాజు, యాళ్ళ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి, ఉప్పలగుప్తం, గోపవరం గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ ఏజేవీ బుచ్చిమహేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, చిక్కం పెద్దబ్బులు, గొలకోటి చిన్నా, రవణం మధు, గొలకోటి సత్తిరాజు, మద్దింశెట్టి సీతారామస్వామి, పెయ్యల దుర్గారావు, గుంటు ఫణిప్రసాద్, పిల్లా బుజ్జి, చీకట్ల ఏసు, మధుర ప్రతాప్, నందిక శ్రీనివాస్, చిక్కం కాసు, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, అడబాల సత్యనారాయణ, వీరా వెంకటేశ్వరరావు, పండు వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు (కిరణ్) పాల్గొన్నారు.

కొత్తపేట: స్థానిక పాత బస్టాండు సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు పూలమాల వేసి నివాళుర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాసరావు, బూసి జయలక్ష్మిభాస్కరరావు, అద్దంకి చంటిబాబు, కముజు వెంకటేశ్వరరావు, విళ్ల మారుతీప్రసాద్, యల్లమిల్లి జగన్మోహన్, ధర్నాల రామకృష్ణ, అద్దంకి చంటిబాబు, ముద్రగడ సుబ్బారావు, గుబ్బల మూర్తి, రెడ్డి శ్రీనివాస్, బయ్యే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మండపేట: యుగ పురుషుడు ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. టీడీపీ శ్రేణులతో కలసి గురువారం స్థానిక టీడీపీ కార్యాలయం, కరాచీ సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి వేగుళ్ల పూలమాలవేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మల్లిపూడి గణేష్, వాదా ప్రసాదరావు, మందపల్లి శేఖర్, గడి రాంబాబు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

కాట్రేనికోన: చెయ్యేరుఅగ్రహారంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, జనిపెల్ల సోమన్న, చెల్లి సురేష్, కృష్ణంరాజు, నంద్యాల వెంకన్నబాబు, గుత్తుల బుజ్జి, మంతెన శ్రీనురాజు, విత్తనాల వెంకటరమణ, చీకురుమెల్లి చక్రధర్, విత్తనాల బుజ్జి, నంద్యాల బాబి, గిడ్డి చంటిబాబు, నామా వెర్రిబాబు, గంగుమళ్ళ భద్రరావు, కామన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజోలు: ఎన్టీఆర్ వర్ధంతిని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో తాటిపాక, రాజోలులో గురువారం నిర్వహించారు. తాటిపాక మఠం సెంటర్, రాజోలు సంత మార్కెట్ వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహాలకు ఆయన పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పాలు, పండ్లు అందజేశారు. తెలుగు యువత నాయకుడు స్థానిక ఏరియా ఆసుపత్రిలో పది మంది తెలుగు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా శ్రీను, రుద్రరాజు వెంకట్రామరాజు, రుద్రరాజు రాజా, రాజోలు మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, కసుకుర్తి త్రినాథస్వామి, బోళ్ల వెంకటరమణ, బందెల పద్మ, మట్టపర్తి లక్ష్మి, కాండ్రేగుల భవానీ, కొత్తపల్లి విజయలక్ష్మి, సర్పంచ్ కడలి సత్యనారాయణ, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు, టీడీపీ రాజోలు గ్రామశాఖ అధ్యక్షుడు బేతినీడి శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, పామర్తి రమణ, మానుకొండ దుర్గాప్రసాద్, కాండ్రేగుల కుశులుడు, కడలి వెంకటరమణారావు, బొక్కా పృథ్వీ, అడబాల చంటి, సోమిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అంతర్వేదిపాలెం, టేకిశెట్టిపాలెంలలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. మరికొన్ని చోట్ల జనసేన, టీడీపీ నాయకులు కలిసి ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. కౌరు శ్రీను, అంతర్వేదిపాలెం పుల్లయ్య, పోతురాజు కృష్ణ, చెల్లింగి లీలాశ్రీనివాస్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్ అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం కొనియాడారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, న్యూలైఫ్ సెంటర్‌లో వికలాంగులకు పండ్లు, దుప్పట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు అక్కల రిష్వంత్‌రాయ్, సీనియర్ నాయకులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, పెంకె సాంబశివరావు, జాస్తి విజయలక్ష్మి, బళ్ల లక్ష్మి, రాజేశ్వరి, జనసేన, టీడీపీ సమన్వయ కమిటీ సభ్యురాలు గజలక్ష్మి, నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు,కొసనా శ్రీనివాసరావు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పి.గన్నవరం: తెలుగు రాష్ట్రాల్లో తెలుగు వారి ఆత్మగౌరవాన్ని కాపాడిన ఘనత టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కే దక్కుతుందని టీడీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ గంటి హరీష్ మాధుర్ అన్నారు. పి.గన్నవరంలో టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గ ద్విసభ్యకమిటీ సభ్యులు నామన రాంబాబు అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ ఉమ్మడి పార్టీల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం మండపేటలో జరగనున్న రా..కదలిరా బహిరంగసభకు నియోజకర్గం నుంచి 25వేలు మంది తరలివెళ్లాలని ఆయన కోరారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు పంచారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనందసాగర్‌రూ.వెయ్యి వంతున ముగ్గురి రోగులకు అందించారు. జనసేన నియోజకవర్గ సమన్వయకమిటీ అధ్యక్షుడు మద్దా చంటిబాబు, టీడీపీ నియోజకర్గ పరిశీలకులు షేక్ శుభాన్, టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, దొమ్మేటి సుధాకర్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సంసాని పెద్దిరాజు, మద్దాల సుబ్బారావు, నేదునూరి వీర్రాజు, తోలేటి సత్తిబాబు, పసలపూడి రామకృష్ణ, మట్టపర్తి రామకృష్ణ, సూదా బాబ్జి పాల్గొన్నారు.

మండపేట బహిరంగ సభకు తరలిరావాలి

ముమ్మిడివరం, జనవరి 18: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు బహిరంగ సభకు అధికసంఖ్యలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి దాట్ల బుచ్చిబాబులు పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలోని తాడి నరసింహారావు స్వగృహంలో గురువారం అర్థాని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన టీడీపీ, జనసేన విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు.మండపేటలో 20న నిర్వహించే రా..కదిలిరా.. బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి 20వేల మంది తరలి వెళ్లేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, నడింపల్లి సుబ్బ రాజు, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, దాట్ల బాబు, గోదశి పుండరీష్, దూడల స్వామి, మోకా బాల ప్రసాద్, కాకర్లపూడి రాజేష్, మోహూరి వెంకటేశ్వరరావు, సాగిరాజు సూరి బాబురాజు, కురసాల శివబాబు, చిక్కాల అంజిబాబు, యాళ్ల ఉదయ్, గొల్లపల్లి గోపి, దొమ్మేటి రమణకుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికపై అవగాహన సదస్సు

అంబాజీపేట, జనవరి 18: గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మిలు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ బి.మమత అధ్యక్షతన గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ నేతల నాగరాజు, సర్పంచ్‌లు నాగాబత్తుల శాంతకుమారి, కోట బేబీరాణి, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలను ప్రభుత్వ నిధులతో అభివృద్ధిచేద్దాం

ఆత్రేయపురం, జనవరి 18: ప్రభుత్వం అందిస్తున్న నిధులతో పంచాయతీలు అభివృద్ధి చెందాలని ఎంపీపీ కుండా అన్నపూర్ణ పేర్కొన్నారు. గురువారం మండలపరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేసేందుకుసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులతో ఎంపీడీవో నాతి బుజ్జి, ఈవోపీఆర్డీ శ్రీనివాస్ సమీక్షించారు. మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి సురేంద్రరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి సమావేశానికి ప్రజాప్రతినిధుల డుమ్మా

మామిడికుదురు, జనవరి18: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ అభివృద్ధి ప్రణాళికా సమావేశానికిసర్పంచ్‌లు, ఎంపీటీసీలు డుమ్మా కొట్టడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఇద్దరు సర్పంచ్‌లు, ఒక ఎంపీటీసీ, ఒక కార్యదర్శి రావడంతో సమావేశం సచివాలయ ఉద్యోగులతో నిర్వహించారు. బుధవారం జరిగిన సమావేశంలో పంచాయతీల్లో నిధులు లేనప్పుడు ఈఅభివృద్ధి ప్రణాళికా సమావేశాలు ఎందుకని సర్పంచ్‌లు నిలదీశారు. ఏవో కె.వెంకటేశ్వరరావు, పట్టిలింగం, సిబ్బంది పాల్గొన్నారు.

సాహిత్యవేత్త యోగి వేమన

అంబాజీపేట, జనవరి 18: యోగి వేమన మంచి సాహిత్యవేత్త అని ఇంటెలిజెన్స్ ఏఎస్ఐ ఇళ్ల ఏడుకొండలు, ఎస్‌కేబీఆర్ కళాశాల ప్రొఫెసర్ బాదం సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అంబాజీపేట ఎస్ఎస్ఎం కళాశాలలో మండల పౌర వేదిక ప్రధాన నిర్వాహకుడు వీరన గోపాలం ఆధ్వర్యంలో యోగి వేమన 657 జయంత్యుత్సవం నిర్వహించారు. యోగి వేమనపై నిర్వహించిన వక్తృత్వ వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వీరన గోపాలం, సహజ కవి పొలమూరి వీరవెంకట సత్యనారాయణ (వెంకట్)లను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మట్టపర్తి సాయిప్రసాద్, గ్రేస్ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకుడు సీఎస్ మూర్తి, ఎస్ఎస్ఎం కళాశాల ప్రిన్సిపల్ రాధామణి, పౌర వేదిక సభ్యులు ఉద్రింక రాంబాబు, పళ్ల సూర్యప్రకాశరావు (బాబ్జీ), షరీఫ్, ఉందుర్తి నాగబాబు, కొల్లూరి దివాకర్, యర్రంశెట్టి పాండు, నాగాబత్తుల సుబ్బారావు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల అవకతవకలపై విచారణ జరపండి

రామచంద్రపురం మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీ బోస్

ద్రాక్షారామ, జనవరి 18: స్త్రీనిధి రుణాలు బ్యాంకులకు చెల్లింపులో అవకతవకలు జరిగినట్లు తన దృష్టికి వచ్చాయని, స్త్రీనిధి రుణాలు చెల్లింపులపై విచారణ జరపాలని రాజ్యసభ సభ్యుడు పిల్లిసుభాష్‌చంద్రబోస్ వెలుగు ఏపీఎంను ఆదేశించారు. గురువారం రామచంద్రపురం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అంబటి భవానీ నెహ్రూ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. మహిళలుతీసుకున్న స్త్రీనిధి రుణాలు తిరిగి చెల్లింపులుచేయగా మధ్యలో సిబ్బంది బ్యాంకులకు చెల్లించకుండా కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. కాపవరం ఎంపీటీసీ సభ్యుడు రెడ్డం సతీష్ మాట్లాడుతూ గ్రామమహిళా సమాఖ్య ఎన్నికలు ఏపీఎం ఆధ్వర్యంలో జరిగినప్పటికి ఎన్నుకున్న కార్యవర్గానికి ఏడాది గడచినప్పటికీ బాధ్యతలు అప్పగించలేదన్నారు. జలజీవన్ మిషన్ పనులు సగంలో నిలిపివేయడంతో గ్రామాల్లో గోతులతో ఇబ్బందులు వస్తున్నాయని అన్నాయిపేట సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డం సతీష్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారం మాట్లాడుతూ కొన్నిగ్రామాల్లో నివేశనాస్థలాలకు పట్టాలు పంపిణీచేసి ఇప్పటివరకు స్థలాలు స్వాధీనపరచలేదని ఎంపీ బోస్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్థలాలు మెరకచేయడం, పూర్తయిన చోట్ల స్థలాలు పట్టాదారులకు స్వాధీనం చేయాలని బోస్ ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో షెలత్‌రాజు, ప్రత్యేకాధికారి ఎం.జి.ఆర్.ఎస్.ఎల్.ఎన్.రాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. 2023-2024 సవరణ బడ్జెట్, 2024-2025 అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు.

మళ్లీ జగన్ వస్తే... రాష్ట్రాన్ని వీడివెళ్లవల్సిందే

పి.గన్నవరం, జనవరి 18: జగన్ మళ్లీ సీఎం అయితే ప్రతి ఒక్కరూ రాష్ట్రాన్ని వీడి బయటకు వెళ్లవల్సిందేనని రాజానగరం టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదిరి విమర్శించారు. లంకలగన్నవరంలో జరిగిన ఉమ్మడి పార్టీల మండల సమావేశానికి టీడీపీ మండల అధ్యక్షుడు తోలేటి సత్తిబాబు అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఏపార్టీకి టిక్కెట్ ఇచ్చినప్పటికి అందరూ కలిసిపనిచెయ్యాలని ఆయన కోరారు. రా కదలిరా చంద్రబాబు బహిరంగసభకు అధికసంఖ్యలో తరలిరావాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు షేక్ శుభాన్, ద్విసభ్యకమిటీ సభ్యులు నామన రాంబాబు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, సంసాని పెద్దిరాజు, బొండాడ నాగమణి, యల్లమిల్లి చిట్టిబాబు, ఆరుమిల్లి లాల్‌బాబు, చొల్లంగి సత్తిబాబు, కొమ్ముల శ్రీనివాసరావు, శేరు శ్రీనుబాబు, ఆరుమిల్లి సాయిబాబు, తాటికాయల శ్రీనివాసరావు, త్సల్లా బింధుమాదవరావు, అంబటి కొటేశ్వరావు, మద్దుల రాజేశ్వరి, యర్రంశెట్టి తాతకాపుపాల్గొన్నారు.

షర్మిల రాకతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం

కొత్తపేట, జనవరి 18: ఏపీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల నియామకంతో ఏపీలో పార్టీకి పూర్వవైభవం చేకూరుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముషిణి రామకృష్ణరావు పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయం వద్ద గిడుగు రుద్రరాజు పుట్టినరోజు వేడుక నిర్వహించారు. పేదలకు పండ్లు, దివ్యాంగులకు ఆర్థిక సాయం అందించారు. నాయకులు ఉదయభాస్కర వర్మ, రెడ్డిబాబు, రాజేంద్రబాబు, లక్ష్మణ్, వెంకట్‌పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: గుంటూరు కారం
వెంకటరమణ	: సైంధవ్
శ్రీలలిత	: గుంటూరు కారం
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరు కారం
గణపతి	: నాసామిరంగ
వెంకటపద్మావతిస్క్రీన్-1	:గుంటూరు కారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	సలార్

అహంకారంతో ప్రజలకు దూరమైన జగన్

అమలాపురం టౌన్, జనవరి 18: రాష్ట్రంలో అధికార పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ విమర్శించారు. రాష్ట్రం ఆందోళనాంధ్రప్రదేశ్‌గా మారిపోయినా సీఎం జగన్‌లో చలనం లేకుండా పోయిందన్నారు. బటన్ నొక్కుడు పథకం ద్వారా తిరిగి అధికారంలోకి రాగలమనే అహంకారంతో ప్రజలకు రోజురోజుకూ జగన్ దూరమైపోతున్నారన్నారు. ఈదరపల్లిలోని ప్రజాసంఘాల కార్యాలయం వద్ద పెద్దిరెడ్డి రాము అధ్యక్షతన గురువారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆటో కార్మికుల పొట్టకొట్టేలా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, నాయకులు పాల్గొన్నారు.

పీఠంలో వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

రాయవరం, జనవరి 18: వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్ 88వ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని గురువారం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీనివాస మంగాపురం ఆలయ అర్చకుడు బాలాజీ రంగాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీనివాస గోవింద..శ్రీవెంకటేశా గోవిందా.. అంటూ భక్తుల గోవింద నామస్మరణల మధ్య శ్రీదేవిభూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపారు. తొలుత పీఠంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామి విగ్రహాలను ప్రత్యేక అలంకరించారు. అనంతరం హోమం, పూర్ణాహుతి జరిపించారు. అనంతరం వేంకటేశ్వరస్వామికి సహస్రనామాలతో కుంకుమార్చనలు నిర్వహించి అర్చక స్వాములు శ్రీనివాసుని కల్యాణం విశిష్టతను భక్తులకు వివరించారు. విజయదుర్గా అమ్మవార్ని ఏపీ హైకోర్టు జడ్జి కిరణ్మయి దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారికి అర్చనలు హారతులు నిర్వహించిన అనంతరం పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు అందుకున్నారు. జడ్జి దంపతులు గాడ్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రామచంద్రపురం డీఎస్పీ టీవీఎస్ఆర్‌కే ప్రసాద్, పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీబాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి), గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, పి.సత్యకనకదుర్గా, బి.రమ, కోట సునీల్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

మామిడికుదురు, జనవరి 18: స్థానిక ఎస్సీ సామాజిక భవనంలో కోనసీమ బ్లడ్ డోనర్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 60మంది రక్తదానం చేశారు. అమలాపురం ఏరియా ఆసుపత్రి సిబ్బంది, బుద్ధా బ్లడ్ బ్యాంకు సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కాండ్రేగుల నరేంద్ర, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేయండి

ఐ.పోలవరం, జనవరి 18: మండపేటలో ఈనెల20న జరిగే చంద్రబాబు బహిరంగ సభకు అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చెయ్యాలని మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పిలుపునిచ్చారు. మురమళ్ళ పార్టీ కార్యాలయం వద్ద గురువారం సమావేశం జరిగింది. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, సాగిరాజు సూరిబాబురాజు, దాట్ల పృథ్వీరాజు, మద్దింశెట్టి పురుషోత్తం, కాకర్లపూడి రాజేష్, గంజా సుధాకర్, నవరపు వెంకటరమణ, మల్లిపూడి రామరాజు, చిలువూరి సుబ్బరాజు, ఆకుల సత్తిబాబు, పెంట రవి, పిన్నమరాజు శివ పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, జనవరి 18: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రావులపాలెం మండలం దేవరపల్లికి చెందిన గంధం మాధవి రూ.1,00,116 విరాళం సమర్పించారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు పంపిణీ

అల్లవరం, జనవరి 18: అయోధ్య శ్రీరామాలయ ప్రతిష్ట అక్షింతలను దేవగుప్తం రామాలయ కమిటీ ఆధ్వర్యంలో మేళతాళాలతో పల్లకిలో ఊరేగించి ఇంటింటికీ పంపిణీ చేశారు. గుండెపూడి, పల్లిపాలెంల్లో అక్షింతలను పంపిణీ చేశారు. ఈనెల22నవాటిని శిరస్సుపై వేసుకోవాలన్నారు. అగ్నికుల క్షత్రియ కమిటీ ఆధ్వర్యంలో అయోధ్య రామ మందిరం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

'తూర్పుగోదావరి'లో విలీనం చేయండి

మండపేట, జనవరి 18: అమలాపురం దూరభారం కావడంతో ప్రజల అవసరాలకు రాజమహేంద్రవరం వెళ్లడం దగ్గరగా ఉంటుందని, అందుకు మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపాలనిఅఖిలపక్షం నేత దూళి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కామాక్షి కల్యాణ మండపంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల20న మండపేటకు వస్తున్న మాజీ సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రాన్ని జేఏసీ అందజేస్తుందన్నారు. చంద్రబాబును కలిసే ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వేగుళ్లను అఖిలపక్షం నాయకులు కోరారు. కోన సత్యనారాయణ, ఎం.గణపతి, కోటిపల్లి సాయిరాం, రావూరి బాబూరావు, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

38వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె



అంగన్‌వాడీలకు సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నాయకులు

ముమ్మిడివరం, జనవరి 18: డిమాండ్ల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం నాటికి 38వ రోజుకు చేరుకుంది. ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. ఉద్యోగభద్రత, కనీస వేతనం అమలు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, అంగన్‌వాడీ నాయకులు ఎస్.దుర్గామహేశ్వరి, ఎం.జయలక్ష్మి, వి.తలుపులమ్మ, జి.శ్రీదేవి, రేవు అనంతలక్ష్మి, రత్నకుమారి, సుబ్బలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు. శిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి దాట్ల బుచ్చిబాబు, నాయకులు నాగిడి నాగేశ్వరరావు, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, దాట్ల బాబు, నడింపల్లి సుబ్బరాజులతో పాటు పలువురు సందర్శించి సంఘీభావంతెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలు కార్యకర్తలకు రూ.20వేలు, హెల్పరుకు రూ.15వేలు ఇచ్చేలా పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడులో మాట్లాడి ఎన్నికల మేనిఫెస్టోలో పెడతామన్నారు.

మామిడికుదురు: డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు గురువారం ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట 216జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారుల నుంచి సంతకాలు సేకరించి తమ న్యాయపరమైన కోర్కెల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం స్పందించి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు

ఆలమూరు/కొత్తపేట, జనవరి 18: చింతలూరు, ఆలమూరు గణేష్ కాలనీలకు చెందిన మోపాటి సత్యనారాయణ, అనుపోజు అర్జున్‌రావు, అడపా రామకృష్ణ, కుడిపూడి చిన్న, వాసంశెట్టి సత్తిబాబు, కొప్పిశెట్టి సత్తిబాబు, వాసంశెట్టి గోవిందు గురువారం మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో ఆ పార్టీలో చేశారు. వారికి ఆయన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. నాయకులు వైట్ల శేషుబాబు, వైట్ల గంగరాజు, చర్ల గిరినాథ్, దొమ్మేటి రామకృష్ణ, మట్టా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి చేరికలు

ఆత్రేయపురం, జనవరి 18: వెలిచేరులో వారా అబ్బులు ఆధ్వర్యంలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన 50మంది నాయకులు జనసేనలో చేరారు. వారికి ఆ పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. అలాగే జనసేన తరపున జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీచేసిన కొప్పుల రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నుంచి జనసేనలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన మండల శాఖ అధ్యక్షుడు చేకూరి కృష్ణంరాజు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మవారి జాతర

కె.గంగవరం, జనవరి 18: యండగండి గ్రామ దేవత ముత్యాలమ్మవారి తీర్థం గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని పూలదండలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వీరేశ్వరస్వామిని దర్శించుకున్న పుదుచ్చేరి ఎస్ఎస్‌పీ

ఐ.పోలవరం, జనవరి 18: పుదుచ్చేరి సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నర్రా చైతన్య దంపతులు బుధవారం వీరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అర్చకులు దర్శనం కల్పించారు. స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందించి సత్కరించారు. ఆలయ చైర్మన్ పెన్మెత్స వాసురాజు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. సీఐ షణ్ముగం, కార్యాలయ సూపరింటెండెంట్ సాధనాల బాబూరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తాం

అమలాపురం రూరల్, జనవరి 18: ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంబాల సతీష్ పేర్కొన్నారు. ఈదరపల్లిలోని కమ్యూనిటీ హాలులో గురువారం ఆర్సీపీఐ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సతీష్ మాట్లాడుతూ జిల్లా విభజన అయితే జరిగింది తప్ప ఇంతవరకు పాలన గాడిలో పడలేదన్నారు. ఒకప్పుడు తీర ప్రాంతాలకే పరిమితమైన ఆక్వాసాగు పట్టణ ప్రాంతాలకు సైతం విస్తరించడం దారుణమన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్య దర్శిగా ముత్తాబత్తుల నాగమణిని, కార్యవర్గ సభ్యులుగా కొట్టాల వెంకటరెడ్డి, మద్దా అనంతలక్ష్మి, బయ్యవరపు పద్మావతి, కొట్టాల అనంతలక్ష్మి, బండి దుర్గాప్రవీణ్, కొట్టాల అనిల్‌లను నియమించారు.

పాత వారికే టిక్కెట్టిస్తే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం

వైసీపీలో వైరి వర్గం అల్టిమేటం



ఉప్పలగుప్తం, జనవరి 18: పార్టీలో అసలైన నాయకులు, కార్యకర్తలకు విలువ ఇవ్వకుండా నియోజకవర్గ నాయకత్వం నియంతృత్వ ధోరణి అవలంబిస్తోందని వైసీపీలోని ఒక వర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. మళ్ళీ వారికే టికెట్ కేటాయిస్తే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని ఆ వర్గం అల్టిమేటం జారీ చేసింది. గుడ్‌సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, వైసీపీకి చెందిన కుంచే రమణారావు గురువారం జగ్గరాజుపేటలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆ పార్టీకి చెందిన పలువురు నియోజకవర్గ ప్రజాప్రతినిధిపై నిప్పులు చెరిగారు. 2014నుంచి వైసీపీ విజయానికి పాటుపడుతూ వచ్చిన రమణారావును, అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను వైసీపీ అధికారంలోకి రాగానే నియోజకవర్గ ప్రజాప్రతినిధి పక్కనబెట్టారని పలువురు వ్యాఖ్యానించారు. రమణారావు మాట్లాడుతూ పలుసేవా కార్యక్రమాల ద్వారా పార్టీ అభివృద్ధికి ఎంతో కష్టపడ్డానన్నారు. అధిష్ఠానం ఈసారి స్థానికులకే అమలాపురం అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని... లేనిపక్షంలో తన అనుయాయులతో కలిసి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

రావులపాలెం, జనవరి 18: రావులపాలెం పంచాయతీ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కొవ్వూరి విజయ భాస్కర్ పంచాయతీకి చెందిన వ్యర్థాల వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల14న సీఆర్సీకి వెళ్లే రోడ్డులో నాయుడు వీధిలోంచి వస్తుండగా రోడ్డుపై వేసిన ముగ్గులు తొక్కించాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న జవ్వాది రవికి విజయభాస్కరరెడ్డికి మధ్యవివాదం జరిగింది. విజయభాస్కర్‌రెడ్డిపై రవి దాడి చేశాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ వైకుంఠం తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేసిన ఎస్ఎస్‌పీ చైతన్య

యానాం, జనవరి 18: పుదుచ్చేరి పోలీస్‌శాఖ చెందిన సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఐపీఎస్ అధికారి నర్ర చైతన్య గురువారం యానాం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మట్లాడారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నియోజవర్గంలోని పలువురు ప్రముఖులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. యానాం సీఐ షణ్ముగం, ఎస్ఐలు శేరు నూకరాజు, కట్టా సుబ్బరాజు, పువ్వల వీరభద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

అందరం కలిసి ఆపన్నులను ఆదుకుందాం

ఉప్పలగుప్తం, జనవరి 18: గొల్లవిల్లి ఉన్నత పాఠశాలలో గురువారం 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. తమకు చదువు చెప్పిన 26మంది ఉపాధ్యాయులను సత్కరించిన విద్యార్థులు వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఉపాధ్యాయుడు కొమ్ముల వెంకటసూర్యనారాయణ మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనాల లక్ష్యం నెరవేరాలంటే ఆపదల్లో ఉన్న సహచర విద్యార్థులను అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఉపాధ్యాయులను కూడా భాగస్వాములు చేయాలన్నారు. దీనికి అందరూ అంగీకారం తెలిపారు.